# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 01-11-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రాన్ని పునర్ నిర్మించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి నిమ్మల రామానాయుడు భరోసా ఇచ్చారు.
- ❖ శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటన బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- ❖ ప్రభుత్వాలు అమలు చేస్తున్న గిరిజన సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలు ప్రతి గిరిజన కుటుంబానికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్. భార్గవి తెలిపారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ లోని దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==========================

రాష్ట్రాన్ని పునర్ నిర్మించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలోని పెద్దన్నవారిపల్లిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈ రోజు పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతోందని, 10 లక్షల బంగారు కుటుంబాలను లక్ష మంది దత్తత తీసుకున్నారని తెలిపారు. పుట్టపర్తిని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి పేర్కొంటూ ...

(వాయిస్ 27 సెకన్లు)

==========================

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న గిరిజన సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలు ప్రతి గిరిజన కుటుంబానికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్. భార్గవి అన్నారు. భగవాన్ బిర్సాముండా 150వ జయంతి సందర్భంగా గిరిజన స్వాభిమాన ఉత్సవాలను విశాఖపట్టణంలోని రుషికొండలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తో కలసి ఆమె ఈ రోజు ప్రారంభించారు. గిరిజన కళాకారులు థింసా, మయూరి, కొమ్ము కోయ, సవర వంటి సాంప్రదాయ గిరిజన నృత్యాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా భార్గవి మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్య పోరాటంలో గిరిజన వీరుల త్యాగాన్ని స్మరించుకోవడం అందరి కర్తవ్యమన్నారు. ఈ ఉత్సవాలను గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు 15 రోజుల పాటు నిర్వహిస్తున్నామని తెలిపారు.

===========================

శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని వెంకటేశ్వర ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటన కారకులపై చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ తొక్కిసలాటలో 9 మంది భక్తులు మృతి చెందారు. శ్రీ సత్య సాయి జిల్లా తలుపుల మండలం పెద్దన్నవారిపల్లెలో ఈ రోజు పర్యటించిన ముఖ్యమంత్రి ఈ ఘటన పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలిపారు. ఈ ప్రమాదంపై విచారణ జరుపుతామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

ఈ ఘటన పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు 2 లక్షల రూపాయల చొప్పున, గాయపడిన వారికి 50 వేల రూపాయల చొప్పున నష్ట పరిహారం అందజేస్తామని ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటించింది. ఇదిలా ఉండగా కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత ఘటనా స్థలాన్ని పరిశీలించనున్నారు.

===========================

గుంటూరు జిల్లాలో తుఫాను కారణంగా నష్టపోయిన పొలాలు, నల్లమడ వాగును కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఈ రోజు పరిశీలించారు. కాకుమాను మండలం అప్పాపురంలో శాసనసభ్యులు రామాంజనేయులు, కలెక్టర్ తమీమ్ అన్సారియతో కలిసి మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా పంట నష్టంపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గుంటూరు ఛానెల్ విస్తరణ, నల్లమడ వాగు ఆధునికీకరణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని వెల్లడించారు. బాపట్ల, పల్నాడు తదితర ప్రాంతాల నుంచి వస్తున్న కాలువల నీరంతా నల్లమడ వాగులో వచ్చి కలుస్తోందని తెలిపారు. ఈ వాగు సామర్థ్యం 22 వేల క్యూసెక్కులు కాగా.. తుఫాను కారణంగా 42 వేల క్యూసెక్కుల వరద నీరు చేరిందని వివరించారు. ఈ వాగును 50 వేల క్యూసెక్కులకు ఆధునికీకరించేందుకు సుమారు 370 కోట్ల రూపాయలతో అంచనాలు రూపొందించామని పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు.

విరామం

===========================

గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏ. ఎస్. దినేష్ కుమార్ తెలిపారు. పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈ రోజు నిర్వహించిన జన్ జాతీయ గౌరవ దినోత్సవ వేడుకలలో ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి, జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజతో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన కలెక్టర్... బిర్సాముండ 150వ జయంతిని పురస్కరించుకొని జన్ జాతీయ గౌరవ్ దివస్ ను పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలో 15 రోజుల పాటు నిర్వహిస్తామని తెలియజేస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

=========================

సీఎంఎస్-03 ఉపగ్రహాన్ని రేపు ప్రయోగించేందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ పేర్కొన్నారు. పలువురు ఇస్రో శాస్త్రవేత్తలతో కలసి ఆయన తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ఈ రోజు దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల పాత్రికేయులతో మాట్లాడుతూ... అత్యంత బరువైన బాహుబలి రాకెట్ కమ్యూనికేషన్ శాటిలైట్‌ను భారత నౌకాదళం కోసం ప్రత్యేకంగా రూపకల్పన చేశామని చెప్పారు. శ్రీహరికోట నుంచి ఎల్వీఎం3 రాకెట్ ను ప్రయోగించనున్నట్లు ఇస్రో ఛైర్మన్ తెలియజేశారు.

=========================

క్రీడాకారులకు గౌరవరం, గుర్తింపు తెచ్చే విధంగా క్రీడా విధానాన్ని రూపొందిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఛైర్మన్ ఎ. రవి నాయుడు అన్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీలను ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఇటీవల డీఎస్సీలో 4 వందలకు పైగా పోస్టులు క్రీడాకారులకు కేటాయించడం జరిగిందన్నారు. జాతీయ స్థాయిలో క్రీడాకారులను తీర్చి దిద్దే లక్ష్యంతో పని చేస్తున్నామని రవి నాయుడు పేర్కొన్నారు.

=========================

ఆంధ్రప్రదేశ్ లోని దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని వాతావరణ కేంద్రం పేర్కొంది. వీటి ఫలితంగా ఉత్తర కోస్తాంధ్రప్రదేశ్ లో ఈరోజు, రేపు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని తెలిపింది. మరిన్ని వివరాలను వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు వెల్లడిస్తూ....

(వాయిస్ 16 సెకన్లు)

=========================

ప్రతి నెలా ఒకటవ తేదీనే శతశాతం పింఛన్లను పంపిణీ చేయాలని విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. విజయనగరం పట్టణంలోని 49వ డివిజన్ కంటోన్మెంట్‌లో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ ఈ రోజు పాల్గొని పలువురికి పింఛన్లు అందజేశారు. అనంతరం డిఆర్‌డిఏ కార్యాలయంలో పింఛన్ల పంపిణీ పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ సందర్శించారు. తొలిరోజే 90 శాతం వరకు పంపణీ చేస్తున్నామని డిఆర్‌డిఏ అధికారులు ఆయనకు వివరించగా, శత శాతం పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

=========================

వైద్య రంగంలో నూతన సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కొత్త మధు మూర్తి అన్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం 39వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ఈరోజు పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో ప్రతి జిల్లాలో వైద్య కళాశాలల ఏర్పాటు చేయడంతో సామాన్యులకు కూడా పూర్తి వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు.

=========================
=========================